**అందరికీ వంకలు పెట్టే కావేరి అంతలా స్తుతిస్తున్న ఆమె నిజంగా అంత అందగత్తెనా? దీప్తి కంటే? ఏమో! పెళ్లి మాట ఎలా ఉన్నా ఆమె నోసారైనా చూసి తీరాలి.**

# చేజారిన ఆ క్షణం

తృటిలో హృదిలో ఓ మధుర భావన అతనిలో కదలాడింది... లీలగా...

ఆశ్చర్యంగా...

అతనిలో ఇదివరకటి వ్యథ క్రమేపీ దూరం కాసాగింది...


** ** **

సాయం సంధ్య విశాఖ సాగర తీరాన్ని తాకి వయ్యారంగా తళుకు లీనుతోంది!

ఆ రోజు ఆదివారం కావడం చేత రామకృష్ణా బీచ్ ఎంతో సందడిగా ఉంది. ఆటల్లో సర్వం మరచిన పిల్లలు, కుటుంబ సమస్యలు చర్చించుకొనే దంపతులు, 'స్వీట్ నథింగ్స్' చెప్పుకొనే జంటలు - ఒక రేమిటి అన్ని వర్గాల వారూ ఉన్నా రక్కడ. ఇంట్లో కరువైన హాయినీ, ప్రశాంతిని అందరికీ సమంగా వంచిస్తోంది ఆ సముద్రతీరం.

వీరందరికీ దూరంగా - జనసమ్మర్థం లేని చోట ఇసుకలో కూర్చుని ఉన్నారు దీప్తి, అఖిలేష్.

"దేవిగారు మౌనవ్రతం గాని పట్టలేదు కదా!" అక్కడికి వచ్చిన చాలా సేపయినా నోరు విప్పని ఆమె నుద్దేశిస్తూ చిరు దరహాసంతో అన్నాడు అఖిలేష్.





కోరుకొండ వెంకటేశ్వరరావు,
సాటూరి వెంకటేశ్వరరావు

ఇనుకలో పిచ్చిక గూళ్ళు కడుతున్న దీప్తి అతని మాటలు విని కూడా మౌనంగా ఉండిపోయింది.

ఆమె మనసు అంతగా బావుండలేదని భావించి సంభాషణ పొడిగించదలచుకోనట్లుగా సిగరెట్ వెలిగించా డతను. పొగను రింగులు రింగులుగా గాలిలో వదులుతూ వాటి పరిశీలనలో పూర్తిగా మునిగిపోయాడు.

"ఇంకా ఎన్నాళ్ళు?" అం దామె నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

"దేనికి?" ఎదు రడిగా డతను ఆమె చేతుల్లో రూపు దిద్దుకొంటున్న పిచ్చిక గూళ్ళవైపు తన దృష్టిని మరలుస్తూ.

"ఇంక దేనికి - మన పెళ్ళికి!" అం దామె కాస్త విసుగును మిళితం చేసి.

"ఓహ్ డియర్! అ దన్నమాట దేవిగారి అలుకకు కారణం! చెప్పానుగా, నాన్నతో మాట్లాడాలని, ఆయన•సరే నంటారని, రేపు వేసవి సెలవుల్లో ఓ మంచి ముహూర్తం చూసేసుకొని మూడు ముళ్ళు వేసేసుకొని, ఆపై మొదటి రాత్రి కో శుభ ముహూర్తం పెట్టేసుకొని ఆ తర్వాత... మరేమో..." అంటూ ఆమె పెదవులను తన పెదవులతో మృదువుగా స్పృశించాడు.

అతన్ని సున్నితంగా పక్కకు నెట్టేస్తూ - "ప్రతిదానికీ ఇ దొహటి అలవాటైం దీమధ్య. హు!" అంటూ చిరుకోపాన్ని ప్రదర్శించింది.

"ఇంతకీ మీవాళ్ళు ఒప్పుకుంటారా? నిజంగా మన పెళ్లి జరిగేనా?"

నీలాకాశం సముద్రపు అంచుల్ని కలిసే చోట దృష్టిని సారిస్తూ తన భయాన్ని ప్రకటించింది.

"మరీ అలా లేడిపిల్లలా బెంబేలు పడిపోతే ఎలా డియర్! ఆరు నూరైనా, నూరు ఆరైనా మన పెళ్లి జరిగి తీరుతుందని చెప్పానుగా. ఎందుకో తెలుసా...? ఎందుకంటే మా నాన్నకి నేనంటే చచ్చేంత ప్రేమ. రేపు సెలవుల్లో ఆయన అనుమతి తీసుకోవడమే ఆలస్యం. ఆపై మూడు ముళ్ళు... మూడు పదుల కౌగిళ్ళు. ఓ.కే?"

ఆమె మోచేతిని ముద్దాడుతూ కొంటెగా ఆమెనే చూస్తూ అన్నాడు.

ఇంతలో అటుగా వచ్చిన పూలవాడివద్ద మూడు మూరల మల్లెదండ కొని దీప్తి జడలో ప్రేమగా తురిమాడు అఖిలేష్.

"ఇప్పటికైనా శాంతించేనా నా దేవి?" అమాయకత్వం ఉట్టిపడేలా అన్నాడు నాటక ఫక్కీలో.

అతని వింత అభినయానికి కిలకిలా నవ్వింది దీప్తి.

రివ్వున వీస్తున్న శీతల పవనానికి నుదుటిపై స్వేచ్ఛగా నాట్య మాడుతున్న ముంగురులను సవరించుకొంటూ అతనినే ఆరాధనగా చూస్తూ అం దామె-

"అయితే మరి వచ్చే వారం నా మద్రాసు ప్రయాణం మానుకుంటున్నాను. అందరూ చెబుతున్నట్లుగా ఆ ఫైనాన్స్ మేనేజర్ జాబ్‌లో డబ్బు, హోదా, పలుకుబడి అన్నీ ఉన్నాయ్. కాదనను. కాని అవన్నీ కలిపినా నీ సాన్నిధ్యం విలువకు సరితూగవుగా. ఏ మంటావు, అఖిలేష్! అందుకే ఎందరు వద్దని వారిస్తున్నా నే నీ నిర్ణయాన్ని తీసుకొన్నాను. లెక్చరర్లుగా ఉంటేనేమి, ఇద్దరం జంటగా ఒకేచోట ఉంటాం కదూ - అంత దూరంగా నిన్నూ నీ ప్రేమనీ విడిచి... ఓహ్ గాడ్! ఆ ఊహనే నేను జీర్ణించుకోలేకపోతున్నాను."

ఒక్క క్షణం సైతం అతని విరహాన్ని భరించలేనట్లుగా తన చేతిని అతని ఛాతీపై రాస్తూ అంది.

ఆమె ప్రేమానురాగాలకు మానసికోల్లాసం రెట్టింపు కాగా - "నిజంగా నే నెంత అదృష్టవంతుడినో కదా! అనుక్షణం న న్నారాధించే ఈ దేవత నా స్వంత మైంది" అంటూ ఆమెను తన బాహువుల్లో బంధించాడు అఖిలేష్.

** ** **

"**పుట్టి** పెరిగి ఇంతవాడి వయ్యావు. చిన్ననాటి నుండి ను వ్వేమి కోరినా అడిగిందే తడవుగా సమకూర్చారే ఆయన... అలాంటిది ఈ రోజు నీ కోర్కెను ఎందుకు నిరాకరిస్తున్నారో అర్థం చేసుకోలేవా, బాబూ! మే మేం చేసినా నీ క్షేమాన్ని ఆశించే కదా!

"చూడు బాబూ! వియ్యు మందేవారి ఆస్తి, అంతస్తు, హోదాలు చూసేది మనకు ఐశ్వర్యం లేదని కాదురా. ఒక కుటుంబంతో సంబంధం కలుపుకొనేటప్పుడు ఏడు తరాలు చూడా లంటారు పెద్దలు. ఎందుకో తెలుసా? అటువైపు వారి వంశ మర్యాదలు సమాజంలో మనకున్న స్థాయిని, గౌరవాన్ని మరింతగా పెంచేటట్లుగా ఉండాలి.

"నీవు కోరుకొనే ఆ అమ్మాయి సౌందర్యవతి అంటావు. కాని ఒక్క విషయం - సృష్టిలో అందం ఏ ఒక్కరి సొత్తూ కాదు. ఆమెను తలదన్నే అందగత్తె లెందరో ఉంటారు. అంతదాకా ఎందుకు - నిన్న కాక మొన్న మేము చూసిన అమ్మాయి చూడు - అపరంజి బొమ్మ సుగుణాల రాశి. అందుకు తగ్గట్టు వంశ ప్రతిష్ఠలు గల కుటుంబం. చూడు, అఖిలేష్! ఇదంతా ని న్నేదో ప్రలోభపెట్టడానికి చెబుతున్నా ననుకొని కొట్టేయకు. కాస్త నిదానించి యోచిస్తే విషయం నీకే పూర్తిగా అవగతమవుతుంది. ఆపై నీ ఇష్టం."

తల్లి చేసిన హితోపదేశంలో సత్యం ఉండవచ్చు. కాని, దీప్తి లేని జీవితాన్ని తను కలలో సైతం ఊహించుకోగలడా?

"మిమ్మల నందరినీ క్షోభ పెడుతున్నందుకు నన్ను మన్నించం డమ్మా! ఏది ఏమైనా నా దీప్తికి నా హృదయంలో ఇచ్చిన స్థానం మ రే అమ్మాయికీ ఇవ్వలేను. నూరేళ్ల జీవితాన్ని పంచుకునేందుకు కావలసింది హోదాలు, అంతస్తులు కలవడం కాదు. మనసులు కలవడం కాదా? నువ్వే చెప్పు!"

తను చెప్పాల్సింది చెప్పి ఇక అక్కడ నిలువలేనట్లుగా మ్లానమైన మనసుతో తన గదిలోనికి వెళ్లిపోయాడు అఖిలేష్.

అటు అల్లారుముద్దుగా పెంచిన తల్లిదండ్రులు - ఇటు హృదయమంతా తానై నిండిన దీప్తి - ఎవరినని త్రోసిపుచ్చగలడు?!


ఎటూ తెగని ఆలోచనల హోరు! డాబాపైకి చేరుకొని వెన్నెలలో చతికిలపడ్డాడు. ఎంతసే పలా గడిచిందో తెలియనే లేదు.

"కంగ్రాచ్యులేషన్స్, అన్నయ్యా!" అన్న కావేరి మాటలకు ఈ లోకంలోనికి వచ్చిపడ్డాడు. తన ఏకాంతానికి భంగం కలిగించిన చెల్లాయిపై పట్టరాని కోపం వచ్చింది.

"అబ్బ! ఇక్కడైనా కనీసం నన్ను మనశ్శాంతిగా ఉండనీయరా? అయినా దేనికట శుభాకాంక్షలు?" విసురుగా అన్నాడు.

దురుసుగా అన్న తన మాటలకు చిన్నబుచ్చుకొన్న చెల్లాయిని చూసి కించిత్తు జాలేసింది అఖిలేష్‌కి.

ఏ రోజైనా మనసు బాగుండకపోతే చెల్లాయితో కబుర్లు, కజ్జాలు పెట్టుకోవడం తన కలవాటే. కావేరి సాన్నిధ్యంలో కాలం ఇట్టే పరుగులు తీస్తుంది. ఎలాంటి మానసిక స్థితిలో ఉన్నా సరే, సత్వరం



పులుపారును తెప్పిస్తుంది. తనను మనస్ఫూర్తిగా నవ్వేటట్లు చేస్తుంది.

"ఝుంగమూతి చెల్లాయ్! అయామ్ రియల్లీ సారీ! ఈ రోజు నా మనసేం బావుండలేదు. అందుకనే అలా చిరాకు పడ్డాను. చెప్పవూ? ఎందుకట శుభాకాంక్షలు? ప్లీజ్!"

అన్నయ్య బుజ్జగింపుతో ఇట్టే కరిగిపోయింది కావేరి.

"పెద్ద! ఏం తెలియనట్లు నన్నే అడుగుతున్నావా?" చేతులు విచిత్రంగా తిప్పుతూ అంది.

"అబ్బ! ఏమందం... ఏం చందం... నిజం చెప్పొద్దూ! కళ్లు చెదరిపోయా యనుకో. సినీ స్టార్స్ కూడా తీసికట్టు సుమా! ఏ వేటూరిగార్నో ఆమె ఎదురుగా కూర్చోబెట్టాలి. ఇహ చూడు పది నిముషాల్లో పది వేల మాటలు ఊడి పడాల్సిందే. అంత సౌందర్యాన్ని అకస్మాత్తుగా చూస్తే ఎవరికి మతిపోదు గనక? నిజంగా అదృష్టమంతా నాదే సుమా!"

ఆమె వాక్ప్రవాహానికి అడ్డు తగులుతూ - "ఇంతకీ ఎవ రా సుందరి? ఏ మా కథ? శుభాకాంక్షలు నా కంటున్నావు. అదృష్టం నీ దంటున్నావు. అంతా గందరగోళంగా ఉంది. కాస్త సవివరముగా మనవి చేయుము, సోదరీ!"

తన చెల్లాయితో అలా గ్రాంథికంగా మాట్లాడడం పరిపాటే.

"అహ... అలా అన్నావు బావుంది" అంటూ ప్రక్కగా వచ్చి కూర్చుంది.

"సదరు జగజ్జేగీయమాన సౌందర్యవతి నామధేయంబు ప్రఫుల్ల చంద్రిక. నివాసంబు కాకినాడ. చరిత్రలో పట్టభద్రురాలు. గుణగణంబులందు ఆమె కామెయే సాటి. అజంతా, ఎల్లోరా శిల్పసుందరులను తలదన్ను వన్నెలున్న చిన్నది."

అన్నయ్యను ఆటపట్టించడానికా అన్నట్లు మధ్యలో ఆపేసింది.

"ఏమి టీ నస్సెన్సు? ఇంతకీ ఎవ రా అమ్మాయి? త్వరగా చెప్పవే."

అతని గొంతులో ధ్వనించిన అసహనానికి కిసుక్కున నవ్వింది కావేరి.

"అంత కుతూహలముగా నున్నదా? ఆమెను నీవే ప్రత్యక్షముగా చూచెదవు గాక!" అంటూ వరములు ప్రసాదించే శ్రీదేవిలా అభయ హస్త ముద్రను ప్రదర్శించింది.

నిస్సహాయ స్థితిలో అయోమయంగా చూస్తున్న అతనితో - "అచ్చం ఇలాంటి అమ్మాయే నాకు వదినెగా రావాలని ఇన్నాళ్లుగా కలలు గన్నాను. నేటి కవన్నీ ఫలించినవి. అయామ్ సో హేపీ. సో మచ్ యూ" అంటూ తన ఆనందోత్సాహాలను కేరింతలతో ప్రదర్శించింది.

ఇదన్నమాట అసలు సంగతి! విషయం నెమ్మదిగా అర్థం కాసాగింది.

కాని - విచిత్రంగా అతని కిదివరకులా కోపం, చిరాకు కలగలేదు!

"ఆమె నిజంగా అంత అందగత్తెనా?" మనసులో అనుకోబోయి కంగారులో పైకే అనేశాడు.

"అవును! కచ్చితంగా అంత అందగత్తియే!" అంది కావేరి నవ్వుతూ. "ఉండు. రేపు మన ప్రయాణానికి ఏర్పాట్లు చేయమని చెప్తాను. నేనూ వస్తాను మళ్లా" అంటూ తూనీగలా తుర్రుమంది.

**ఓ చల్లని** పిల్లతెమ్మెర అతని విచార వదనాన్ని స్పృశించి క్షణంలో ప్రసన్నతను ఆపాదించింది.

"పోనీ ఓసారి చూసొస్తే ఏం పోయింది? కేవలం చూసినంత మాత్రాన నిశ్చయం చేసుకోవాలని ఏమీ లేదుగా!" తనకి తనే సర్ది చెప్పుకున్నాడు.

అందరికీ వంకలు పెట్టే కావేరి అంతలా స్తుతిస్తున్న ఆమె నిజంగా అంత అందగత్తెనా? దీప్తి కంటే? ఏమో! పెళ్లి మాట ఎలా ఉన్నా ఆమె నోసారైనా చూసి తీరాలి.

తృటిలో హృదిలో ఓ మధురభావన అతనిలో కదలాడింది... లీలగా...

ఆశ్చర్యంగా-

అతనిలో ఇదివరకటి వ్యథ క్రమేపీ దూరం కాసాగింది. ఆ స్థానంలో మరునాడు ఎదుర్కొనబోయే తీయని అనుభూతుల ఊహామాలిక మనసుని అలరించసాగింది.

ఆర్తిగా ఆస్వాదించ మంటుంది అందం-
బానటగా నిలువ మంటుంది హృదయం!

** ** **

కారులో కాకినాడ చేరుకొనేసరికి పదయింది. మాటల్లో చెప్పలేని అనిర్వచనీయమైన థ్రిల్... ముప్పిరిగొన్న ఆలోచనలు... ఒక అద్భుత సౌందర్యరాశిని చూడబోవడం, అందునా ఈ హోదాలో... ఎంతో గర్వంగా ఉల్లాసంగా ఉంది!

తన హేర్ స్టైల్ మాటి మాటికీ సరిచేసుకుంటున్నాడు. చేతులు పదే పదే నెక్టై ముడిని సవరిస్తున్నాయ్. అవును మరి, తనూ జిగేల్మనిపించాలి!

స్వాగత వచనాలతో ఇంట్లోనికి ప్రవేశించారు. బ్రాహ్మణుని సలహా మేరకు ముహూర్త సమయానికి అమ్మాయిని గదిలోనికి తీసుకువచ్చారు.

ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని బ్రహ్మ మలచిన అపర మేనకలా ఉం దామె. కావేరి అన్న ప్రతి మాట అక్షర సత్యం! రెప్ప వాల్చడం మరచి ఎంతోసేపు ఆమె సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఉండిపోయాడు అఖిలేష్.

కను రెప్పలను సుతారంగా లేపి అతనిపై క్షణకాలం దృష్టిని నిలిపి సన్నగా నవ్వింది.

ఆమె గురించిన పలు రకాల ఆలోచనలు అతని మస్తిష్కంలో చోటు చేసుకోసాగాయి. చివరగా అనుకున్నాడు... ఏముంది ఈమెలో ప్రత్యేకత? ఈ మెరుపంతా అలంకరణలో వచ్చిందే కదా! ఈ పై మెరుగులు చూసేనా వీళ్లంతా అపురూప సౌందర్యరాశి అంటూ పొగిడారు?

ఆ పట్టుచీర, నగలు వగైరాలు లేకుంటే ఆమె అందం అద్వితీయ మేమీకాదు - అదీకాక బాహ్య శరీరపు తళుకు బెళుకులను ఆధారంగా ఆమె అంతరంగాన్ని గ్రహించలేము. ఒక స్త్రీ మనసు క్షుణ్ణంగా తెలిసేది ఆమె సాన్నిధ్యంలోనే కద! ఇన్నాళ్ల సాన్నిధ్యంలో తన కెంతో చేరువైన దీప్తి... ఆమె సాటిలేని వ్యక్తిత్వం... అదేగా తనను ఆమెవైపు ఆకర్షింపచడేటట్లు చేసింది... ఈమే కాదు సాక్షాత్ దేవకన్యలు దిగివచ్చినా దీప్తికి సాటి రాగలరా?... దీప్తి ఎక్కడ?... ఈమె ఎక్కడ?


"ఏం చదువుకున్నా వమ్మాయ్!" ప్రశ్నల ప్రహసనం సాగుతోంది...

"క్రిందటేడే డిగ్రీ పూర్తి చేశానండీ." ఆమె కంఠంలో సౌమ్యత తొణికిసలాడింది.

అప్పుడు - సరిగా అప్పుడు - వచ్చిం దామె గదిలోనికి, ఒక పళ్లెంలో పళ్లరసం గ్లాసులను పట్టుకొని.

అక్కడకు పెళ్లిచూపుల కొచ్చిన ఆ యువకుణ్ణి చూసి త్రుళ్లిపడి ఉత్తర క్షణంలో తనను తాను సంబాళించుకొంది.

"తీసుకోండి" అంటూ ట్రే అతని ముందు జరిపింది. ప్రఫుల్లనే పరిశీలనగా చూస్తున్న



అఖిలేష్ తొట్రుపడి గ్లా సందుకొని త నెదురుగా నిల్చున్న ఆమెను చూసి నిర్ఘాంతపోయాడు.

మరుక్షణంలో అతని శరీరమంతా స్వేదబిందువులు పేరుకొన్నాయి.

అతనినే పరీక్షగా చూస్తూ-

"ప్లీజ్, రిలాక్స్!" అంది.

ఆమె గొంతు స్థిరంగా ఉంది.

ఆమె... దీప్తి!

** ** **

సాయం సంధ్య విశాఖ తీరాన్ని తాకి వింతగా తళుకులీనుతోంది. పలు రంగుల్లో వింతగా విశ్లేషించబడుతోంది.

ఇంట్లో కరువైన హాయిని, ప్రశాంతిని అందరికీ సమంగా పంచిస్తోంది ఆ సముద్రతీరం.

గుంపులు గుంపులుగా కూర్చున్న అందరికీ దూరంగా, ఓ మూల ఒంటరిగా కూర్చున్న ఆ ఇద్దరి మధ్య సుమారు అర్ధ గంటగా మౌనం నిరంకుశంగా రాజ్య మేలుతోంది. చివరి కతనే ప్రారంభించాడు.

"నన్ను మన్నించు, దీప్తీ!"

అతని కంఠం స్థిరత్వాన్ని కోల్పోయినట్లుగా సన్నగా వణికింది. "ఇంట్లో కోరిక కాదనలేక సరదాగా - కేవలం సరదాగా - అక్కడికి వచ్చాను. అంతేగాని, నిశ్చయ తాంబూలాలు పుచ్చేసుకొని ఆమెను కట్టేసుకోవాలని కాదు. నిజం దీప్తీ... నన్ను నమ్ము... ప్లీజ్!"

అభ్యర్థించసాగాడు అఖిలేష్.

"హు! సరదా!" వెటకారం ధ్వనించేలా పెద్దపెట్టున నవ్వింది దీప్తి. "ఆడవాళ్లంటే అంత ఆటబొమ్మల్లా కనిపిస్తున్నారా నీ కళ్లకి?" ఈసడింపుగా అంది.

ఆమె కనులు కోపోద్రిక్తమై అతని అహాన్ని కాల్చేసేలా నిప్పురవ్వల్ని కురిపిస్తున్నాయ్.


ఆమెను సూటిగా ఎదుర్కొనలేని అతని చూపులు ఎటో ప్రక్కదారి పట్టాయి.

"పొరపా టయిపోయిందని చెబుతున్నానుగా!" కొంత తగ్గు స్వరంతో ఒప్పించే ధోరణిలో అన్నాడు.

ఉద్రేకంగా పొంగుకొస్తున్న కెరటాలు తీరాన్ని దూకుడుగా తాకి, ఎగిరిపడి మరల వెనక్కి మరలుతున్నాయి. వాటినే తదేకంగా చూస్తూ అంది దీప్తి.

"అసలు పొరపాటు నీది కాదు, అఖిలేష్! నాది. ఇన్నాళ్లుగా నీతో ఇంత సన్నిహితంగా ఉంటూ కూడా ఆదర్శాలు వల్లించే నీ అసలు నైజాన్ని గ్రహించలేకపోయాను. ఒక అమ్మాయిని ప్రేమించి త్వరలో పెళ్లి చేసుకొనే ఆలోచన ఉండి కూడా మరో అమ్మాయిని పెళ్లిచూపుల ముస్తాబులో చుద్దామనే కోరిక కలిగిందా నీకు! శహబాష్! అదీ సరదాగా - యు మీన్ జస్ట్ ఫర్ ఫన్?

"ఆడవాళ్ల జీవితాలపై నీ కింత చవుకబారు అభిప్రాయా లున్నాయని నేను కలలో సైతం ఊహించలేకపోయాను. నీవంటి పురుషాహంకారం బుసలుకొట్టే 'సహృదయశీలి' నా ప్రియుడని చెప్పుకోవడానికి ఎంతో గర్వంగా




ఉంది, అఖిలేష్ నిజం!" ఎగతాళిగా అంది.

ఈటెల వంటి ఆమె మాటలు సరిగ్గా గురి చేయబడిన చోటే తగిలాయి.

తల దించుకొని మౌనం పాటించడం మినహా ఏం చేయగలడు! కాసేపయాక కరువైన మాటలను కూడదీసుకొంటూ-

"దీప్తీ! మున్ముందు జీవితంలో ఇలాంటి పొరపాట్లు జరగవని వాగ్దానం చేస్తున్నాను." దృఢంగా అన్నాడు.

అతని మాటల నేమాత్రం పట్టించుకోనట్లుగా ఆకాశం సముద్రంతో కలిసే సంగమ రేఖ వైపుగా దృష్టిని సారిస్తూ స్థిరంగా అంది-

"చూడు, అఖిలేష్! జీవితం ఎంతో విలువైనది. కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలో దుర్బలులు కప్పదాట్లు వేస్తుంటారు. సంక్లిష్ట పరిస్థితులను ఎదురొడ్డి నిల్చోలేక ఆత్మవంచనతో ప్రక్కకి జారుకొంటారు. నాతో జీవితాన్ని పంచుకొనే వ్యక్తి అన్నింటికీ మించి స్థిరమైన మనసు కలవాడై ఉండాలి. తాత్కాలిక ఆకర్షణలకు, భ్రమలకు, వ్యామోహాలకు లొంగిపోయే చపలచిత్తుణ్ణి, నా భాగస్వామిగా స్వీకరించలేను. ఈ జీవితం నాది. నేను నమ్మిన విలువలకు ఆదర్శంగా నిలిచే దృఢచిత్తం గల వ్యక్తే నాకు భర్తగా కావాలి. నువ్వు అలాంటి మగాడివేమోనని భ్రమించాను.

"కాని ఎంతో కాకతాళీయంగా జరిగిన ఆ సన్నివేశం నీ అసలు రంగును వెలికితీసింది. మా పిన్ని కుమార్తెను పెళ్లిచూపులకని అలంకరించడానికి నన్ను కాకినాడ తీసుకొని వెళ్లారు. నిజానికి అంత దూరం వెళ్లాల్సిన అవసరం లేదు. కాని ఆనాడు మా బాబాయి నన్ను చదివించకపోయి ఉంటే నే నీనాడు లెక్చరర్‌ని అయ్యేదాన్ని కాదు. తీరా అక్కడికి వెళ్లాక వాళ్లు విజయవాడ సంబంధం అన్నారే కాని, నువ్వు వైజాగ్‌లో లెక్చరర్‌వని చెప్పలేదు.

"ఏది ఏమైనా నేను చాలా అదృష్టవంతురాలిని. నీ మనోచాపల్యం సంగతి ముందుగానే తెలిసింది. బై ది బై... ఈ రోజే నా జాబ్‌కి రాజీనామా చేశాను. మద్రాసు వెళ్లిపోతున్నాను. నన్ను మరల కలుసుకోవడానికి ప్రయత్నించకు. గుడ్ బై!" అంటూ తటాలున లేచి చకచకా నడవసాగింది దీప్తి.

"చిన్న ప్రలోభానికి లోబడి ఎంత పెద్ద పొరపాటు చేశాను!"

చేజారిపోయిన ఆ క్షణం గురించి తెగని ఆలోచనలోనికి జారిపోయాడు అఖిలేష్.

తీరాన్ని తాకి వెనక్కి మళ్లిన కెరటాలు మరల ఉధృతంగా లేస్తూనే ఉన్నాయి.

మనసంతా శూన్యం ఆవరించుకోగా, ఆమె వెళ్లినవైపే నిరాశగా చూడసాగాడు అఖిలేష్. రోడ్డు వైపుగా సాగిపోతూ క్రమంగా దూరమౌతున్న దీప్తి మెల్లమెల్లగా కనుమరుగవసాగింది.

"దీప్తీ!"

అసంకల్పితంగా అతని నోటినుండి వెలువడిన కేక సముద్రపు కెరటాల హోరులో కలిసిపోయింది. ★